1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | జనవరి 27, 2024 | www.navatelangana.com

డిగ్రీ కాలేజీ ఉన్నట్టా..? లేనట్టా..?

• గణతంత్ర వేడుకలకు దూరం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్‌లో డిగ్రీ కాలేజీ ఏర్పాటు.. మండల చుట్టుపక్కల వాససుల ఎన్నో ఏండ్ల కల. దాన్ని నిజం చేస్తూ గత ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు కాలేజీ మంజూరు చేసి జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేశారు. అయితే కొద్ది రోజులుగా కాలేజీ ఉనికిలో లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు సైతం చేపట్టకపోవడంతో అసలు డిగ్రీ కాలేజీ ఉన్నట్టా..? లేనట్టా..? అనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాలేజీ ప్రారంభించిన తొలి నాళ్లలో ఆగస్టులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సైతం నిర్వహించారు. కానీ ఈసారి నిర్వహించకపోవడం గమనార్హం. జూనియర్ కాలేజీలో అధ్యాపకులు, సిబ్బంది వచ్చి వేడుకలు నిర్వహించినా.. డిగ్రీ కాలేజీ వారు నిర్వహించకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



జెండా ఎగుర వేయకపోవడంతో బోసి పోయిన కాలేజీ

దేశంలోనే మొదటి స్థానంలో కామారెడ్డి ఎల్ఐసి బ్రాంచ్

నవతెలంగాణ-రామారెడ్డి

ఎల్ఐసిలో జనవరి 19వ తేదీన చేసిన వ్యాపారంలో దేశంలోనే కామారెడ్డి బ్రాంచ్ మొదటి స్థానంలో నిలిచిందని బ్రాంచ్ మేనేజర్ తులసి రామ్ తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా బ్రాంచ్ కార్యాలయంలో శుక్రవారం జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అత్యధిక పాలసీలు విక్రయించిన ఎల్ఐసి విస్తరణ అధికారులతో పాటు ఏజెంట్లను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన డివిజనల్ ఆఫీస్, నూతన వ్యాపార మేనేజర్ సుందర్ బాబు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ చౌహన్, విస్తరణ అధికారులు వెంకటేశ్వర్లు, వీరేశలింగం, మారుతి, ఇక్బాల్ అహ్మద్, నరేష్, లియఫీ నాయకులు కొండ బైరయ్య, నారాయణ రావు, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.



ఏజెంట్‌లను సన్మానిస్తున్న అధికారులు

పారదర్శకంగా ప్రజాపాలన

• ఉద్యోగాల కల్పన, నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి
• గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-కంఠేశ్వర్

'గణతంత్ర దినోత్సవ సందర్భంగా, దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు సమాన అవకాశాలతో ప్రాథమిక హక్కులతో తారతమ్య భేదాలు లేకుండా జీవనం సాగించాలని, అభివృద్ధి ఫలాలు అందరికి అందాలని బాబా సాహెబ్ అంబేద్కర్ మన రాజ్యాంగాన్ని రూపొందించిన సందర్భముగా ఆయనను స్మరించుకొనడం మన బాధ్యత. అదే విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడేలా ప్రజలకు పారదర్శకమైన ప్రజా పాలన చేపట్టడం ద్వారా ప్రజల ఉద్యమ ఆకాంక్షలు, ప్రజా సంక్షేమం నెరవేర్చడమే ఈ ప్రభుత్వ ప్రాధాన్యాలు. ప్రతి అర్హుడికి సంక్షేమ ఫలాలు అందించడం ప్రభుత్వ బాధ్యత' అని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో రిపబ్లిక్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిపై కీలకోపన్యాసం చేశారు.

సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలనే ఉద్దేశ్యముతో సంక్షేమంలో సరికొత్త అధ్యాయం సృష్టిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 6 గ్యారెంటీ పథకాలు ప్రవేశపెట్టినట్టు తెలిపారు. 6 గ్యారంటి సంక్షేమ పథకాలైన అభయ హస్తం, మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి యువ వికాసం, చేయుత పథకము లను ప్రకటించి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే కార్యక్రమాలలో భాగంగా 6 గ్యారంటిలలో ఇప్పటికే రెండు గ్యారంటి పథకములను అమలు చేస్తున్నట్టు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పన, నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి వార్షిక ఉద్యోగ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ప్రజలు అందరూ తమ హక్కులను ఉపయోగిం చుకుంటూ, బాధ్యతలను విస్మరించకుండా దేశసేవకు, దేశాభివృద్ధికి పాటుపడాలి అని కోరుకుంటూ జిల్లా అభివృద్ధిలో భాగస్వాములైన ప్రజలకు ప్రజా ప్రతినిధులకు అధికారులకు, శాంతి భద్రతల నిర్వహణకు అహర్నిశలు కృషిచేస్తున్న పోలీసు యంత్రాంగానికి, వైద్యులకు, పారిశుద్ధ కార్మికులలకు, పత్రిక విలేఖరులకు మరియు ఎలక్ట్రానిక్ మీడియా సిబ్బందికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లాను అభివృద్ధి పథంలో నిలుపుటకు అందరి సహకారాన్ని కోరుచూ, మరొకసారి జిల్లా ప్రజలందరికి 75 వ గణతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్సాహభరితంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

రిపబ్లిక్ డే వేడుక సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ఎదనిండా దేశభక్తి భావాన్ని నింపుకుని తమ ప్రదర్శనలతో గణతంత్ర దినోత్సవ వేడుకలకు వన్నెలద్దారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన బాలబాలికలు చూడచక్కని నృత్య రీతులను అలవోకగా ప్రదర్శిస్తూ ఔరా అనిపించారు. బాలబాలికలు ఏకరూప దుస్తులు ధరించి తమ అభినయంతో అలరింపజేశారు. ఈ సందర్భంగా చిన్నారులను కలెక్టర్‌తో పాటు ఇతర అతిథులు, జిల్లా ఉన్నతాధికారులు వారి వద్దకు వెళ్లి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీ డి.అరవింద్, అర్బన్ శాసన సభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, నగర మేయర్ నీతూకిరణ్, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరందు, ట్రైనీ ఐ.పీ. ఎస్ చైతన్య, డీ.ఎఫ్.ఓ వికాస్ మీనా, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు బహూకరించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించారు.



జెండా వందనం చేస్తున్న కలెక్టర్, ఎంపీ, అధికారులు



చిన్నారులను విష్ చేస్తున్న కలెక్టర్



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తూ..



పెద్దబజార్ నుంచి గాంధీ చౌక్, బస్టాండ్ మీదుగా ధర్నా చౌక్‌లో చేపట్టిన ర్యాలీలో నినాదాలు చేస్తున్న నాయకులు

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

• కార్మిక చట్టాలు అమలు చేయాలి • ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు వీడాలి
• కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్రంలోని ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని వివిధ కార్మిక, ప్రజా, వ్యవసాయ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి బడా పెట్టుబడి దారులకు అనుకూలంగా రూపొందించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సాగు చట్టాలను పున: ప్రవేశపెట్టే ఆలోచనను విరమించుకోవాలని, రైతులను, రైతు కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త నిరసనలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. 'స్వాతంత్రానంతరం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోరాటం చేసి, 700 మంది పైగా ప్రాణాలను త్యాగం చేసి, రైతు వ్యతిరేక చట్టాలని వెనక్కి తిప్పికొట్టిన ఘనత రైతు వీరోచిత పోరాటానికి దక్కింది. ఆ సందర్భంగా రైతు సంక్షేమం కోసం ఇచ్చిన హామీలని ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేయకపోగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అలాగే వ్యవసాయ కూలీలకు పని కల్పించడం కోసం తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి కుట్ర పన్నుతున్నారు. అందులో భాగమే ఉపాధి పని క్షేత్రాలలో ఉదయం, సాయంత్రం ఫోటోలు తీసి రెండు ఫోటోలు ట్యాలీ అయితేనే డబ్బులు ఇస్తామని బెదిరిస్తున్నారు. పైగా 80 శాతం పైగా ఉన్న పేద రైతులు వృత్తిదారులు కూలీలు ఓటేసి గెలిపిస్తేనే ప్రధానమంత్రి అయ్యాడు అన్న విషయాన్ని మర్చిపోయి ఆయనకు అధికార పీఠాన్ని కట్టబెట్టిన ప్రజలను దొంగలుగా చూస్తున్నారు. ఇప్పటికే అనేక నెపాలతో ఒక కోటి మందిని జాబ్ కార్డ్ నుంచి తగ్గించిన నీచ చరిత్ర మోడీ కున్నది. అలాగే సంఘటిత సంఘటిత రంగ 44 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా మార్చి అభద్రత భావం కల్పించి, కార్పొరేట్ సంస్థలకు పారిశ్రామిక సంస్థలకు బానిసలుగా మార్చినటువంటి నీచ చరిత్ర మోడీకి ఉన్నది. 75వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని అయినా ఈ సమస్యలను పరిష్కరిం చకపోతే రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమం సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు దేవారం అధ్యక్ష వహించగా, ఎస్‌కేఎం జిల్లా కమిటీ నాయకులు పెద్ది వెంకట్రాములు, పల్లపు వెంకటేష్, రాజేశ్వర్, గంగాధరప్ప, గంగారాం, జెపి గంగాధర్, గుమ్మల గంగాధర్, నందిపేట గంగా ధర్, భాస్కర్, గంగారెడ్డి పాల్గొన్నారు. మద్దతుగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, ట్రేడ్ యూనియన్‌లు, విద్యార్థి సంఘాలు, వృత్తి సంఘాలు, మహిళా సంఘాలు పాల్గొన్నాయి. సిఐటియు జిల్లా అధ్యక్ష-కార్యదర్శులు శంకర్ గౌడ్- నూర్జహాన్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఓమయ్య, ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు భూమయ్య, వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇడగొట్టి సాయిలు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు విగ్నేష్, నగర కార్యదర్శి మహేష్, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో నినాదాలు చేస్తున్న నాయకులు

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ కథనం ఎఫెక్ట్

నవతెలంగాణ-మద్నూర్

పాత తాలూకా కేంద్రమైన మద్నూర్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ సబ్ డివిజనల్ కార్యాలయాన్ని శుక్రవారం పున:ప్రారంభించారు. మద్నూర్ నుంచి అనధికారికంగా తరలించడంపై 'బిచ్కుందలో ఆఫీస్.. మద్నూర్ స్టాంప్' శీర్షికతో ఈ నెల 24వ తేదీనా నవతెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం గణతంత్రదినోత్సవం పురస్కరించుకొని పాత కార్యాలయాన్ని శుభ్ర పరిచి బోర్డ్ ఏర్పాటు చేసి గణతంత్ర వేడుకలను నిర్వహించారు. ఆర్డబ్ల్యూఎస్ శాఖ డిప్యూటీ ఇంజనీర్ అరవింద్ కుమార్ గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో డివిజనల్ పరిధిలోని ఇతర మండలాల అధికారులు హాజరయ్యారు. కార్యాలయాన్ని తిరిగి ప్రారంభిస్తూ బిల్డింగుకు ప్రత్యేకంగా బోర్డును సైతం ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని బిచ్కుందకు ఎందుకు తరలించారని విలేకరులు ప్రశ్నించగా సంబంధిత శాఖ డిప్యూటీ ఇంజనీర్ అరవింద్ కుమార్ సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. ఇప్పటికైనా కార్యాలయం ఇక్కడే కొనసాగుతుందా మళ్లీ తరలిస్తారా అని ప్రశ్నించగా అలా జరగదని ఇక్కడే కొనసాగేలా విధులు నిర్వహిస్తామని తెలిపారు. ఇక్కడి నుంచి తరలిపోయిన కార్యాలయం గురించి నవతెలంగాణ దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురించి కార్యాలయం వెనక్కు రప్పించేలా కృషి చేసిందంటూ స్థానికులు నవతెలంగాణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



అధికారులను సన్మానించిన స్థానికులు, నాయకులు

జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

• రాజ్యాంగంతో సంపూర్ణ స్వేచ్ఛ, సమానత్వం, లౌకికతత్వం, న్యాయం పొందడం ప్రతిఒక్కరి హక్కు
• గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ జితేశ్ వి పాటిల్
• ప్రజాపాలనకు కృషి చేస్తున్నట్టు వెల్లడి

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పిలుపునిచ్చారు. 75వ గణతంత్ర దినోత్సవం సంధర్భంగా శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేడుకలలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత భారతదేశ పౌరులందరిని ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో నడిపించడానికి, స్వాతంత్ర్య పోరాట ఆశయాలను నెరవేర్చడానికి భారత ప్రభుత్వానికి రాజ్యాంగం లేనందున 1935 భారత ప్రభుత్వ చట్టం ఆధారంగా పాలన కొనసాగిందని తెలిపారు. కొత్తగా దేశ రాజ్యాంగాన్ని రూపొందించుటకు 1947 ఆగస్టు 28న డాక్టర్ బాబా సాహెబ్ అంబెద్కర్ అధ్యక్షతన రాజ్యాంగ నిర్మాణ కమిటీని ఏర్పాటు చేసి అతి పెద్ద రాజ్యాంగాన్ని లిఖించుకున్నామన్నారు. 1930లో పూర్తి స్వరాజ్య కోసం ప్రకటన చేసి జనవరి 26ను పూర్తి స్వరాజ్య జయంతి దినోత్సవం జరుపుకోవాలని పిలుపునిచ్చి, ఆ తేదీ ప్రాముఖ్యత దృష్ట్యా బ్రిటిష్ కాలం నటి భారత ప్రభుత్వ చట్టం 1935 రద్దు చేస్తూ 1950 జనవరి 26 నుంచి నూతన రాజ్యాంగం అమలులోకి తెచ్చుకున్నామన్నారు. నాటినుండి భారత దేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా అవతరించిందని, ప్రజలందరూ సంపూర్ణ స్వేచ్ఛను, సమానత్వాన్ని, లౌకికత్వాన్ని, న్యాయాన్ని పూర్తి స్థాయిలో హక్కుగా పొందారని గుర్తు చేశారు.

ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రామాల ప్రగతిని ప్రస్తావిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలనే తపనతో తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదని, అందులో భాగంగా ఆరు గ్యారంటీల అమలుకు హామీ ఇచ్చి, రెండు గ్యారంటీలను ఇప్పటికే నెరవేర్చిందని అన్నారు. అందులో మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో 27 లక్షల 75 వేల మంది మహిళలు ఆర్.టి.సి. బస్సులలో ఉచితంగా ప్రయాణించారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శమైన పాలన అందించుటకు గత డిసెంబర్ 28 నుండి జనవరి 6 వరకు ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టిందని, ఈ కార్యక్రమం కింద జిల్లాలోని 526 గ్రామ పంచాయతీలు, 80 మునిసిపల్ వార్డులలో 6 గ్యారంటీల కోసం 2,94,799 ధరఖాస్తులతో పాటు ఇతర సమస్యల గురించి 13,367 దరఖాస్తులు స్వీకరించి కంప్యూటరీకరణ చేశామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. రైతన్నలకు వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్‌తో పాటు పంట పెట్టుబడి సాయం అందిస్తున్నదని అన్నారు. 2 లక్షల రూపాయల పంట రుణాల మాఫీకి ప్రభుత్వం బ్యాంకులతో సంప్రదింపులు జరుతున్నదని, పద్ధతి ప్రకారం ప్రక్రియ పూర్తి చేయుటకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని కలెక్టర్ పేర్కొన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. ప్రజలు జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

అనంతరం శాసన సభ ఎన్నికలు సజావుగా నిర్వహించుటలో చిత్తశుద్ధితో పనిచేసిన అధికారులకు, ఉత్తమ సేవలు అందించిన పలువురు ఉద్యోగులకు కలెక్టర్ జితేష వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ, పార్లమెంటు సభ్యులు బిబి పాటిల్, జిల్లా పరిషద్ చైర్ పర్సన్ దఫెదర్ శోభ, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరించి జాతీయగీతం ఆలపిస్తున్న కలెక్టర్, అధికారులు





కామారెడ్డిలోని కళామందిర్‌లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

• సాలూరలో అంబేద్కర్ విజ్ఞాన మందిరాన్ని ప్రారంభించిన డా.ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్
• కులమతాలకతీతంగా రాజ్యాంగంలో స్వేచ్ఛ, సమానత్వం కల్పించినట్లు వెల్లడి





గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్.. ఆర్ఎస్‌పీకి పెయింటింగ్ వర్క్ ఫ్రేం అందజేస్తున్న లక్ష్మణ్

నవతెలంగాణ-బోధన్

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థి దశనుండే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని స్వేరోస్ నెట్వర్క్ వ్యవస్థాపకులు, బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవ సందర్భంగా నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రంలో అంబేడ్కర్ విజ్ఞాన మందిరం (గ్రంథాలయం) ప్రారంభించారు. అనంతరం టిటీడి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని దేశానికి అందించిన గొప్ప వ్యక్తి డా.బి.ఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం, హక్కులను రాజ్యాంగంలో పొందుపరిచారని అన్నారు. లండన్, కొలంబియా యూనివర్సిటీల్లో చదివే రోజుల్లో అంబేడ్కర్ నివసించిన ఇండ్లు నేడు గొప్ప గ్రంథాలయాలుగా మారాయని గుర్తుచేశారు. విద్య ద్వారానే పేదలకు విముక్తి లభిస్తుందన్న ఆయన విద్య లేకపోతే తాను కూడా పాలమూరు జిల్లాలోని తుంగభద్ర నది పక్కన కూలీ పనులు చేసుకుంటూ బతికేవాన్నని తెలిపారు. దేశంలో గుడులతో పాటు బడులు ఉండాల్సి ఉండగా.. బడులు ఖాళీగా ఉంటే జైళ్లన్నీ నిండుగా ఉంటాయని అన్నారు. యువత క్రమశిక్షణతో చదివితే అనేక అద్భుతాలు సష్టిస్తూ, నూతన ఆవిష్కరణలు రూపొందించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ రాష్ట్ర నాయకులు సాయన్న, జిల్లా అధ్యక్షులు అవినాష్, సేఫ్ సొసైటీ జిల్లా అధ్యక్షులు లింబూరి లక్ష్మణ్, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సింగాడే పాండు, గ్రామస్తులు ఇల్తేపు శంకర్, బుద్దే రాజేశ్వర్, వెంకట్ పటేల్, గోవింద్ గౌడ్, రాజా గౌడ్ పార్టీ నాయకులు గంగాధర్,సింగాడే సునీల్, వెంకటిపటేల్, ఈ.రమేష్, గోవిందగౌడ్, రాజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ట్రాక్టర్, బైక్ ర్యాలీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు,కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిజామాబాద్ నగరం లో అఖిల భారత రైతు కూలి సంఘం, ఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాక్టర్, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(యం-యల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ మూడు రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చాడని, దానిని దేశ రాజధానిలో రైతుల ఆందోళనల ఫలితంగా వెనక్కి తీసుకున్నారని , రైతుల ఆత్మహత్యలు అరికట్టేందుకు కనీస మద్దతు ధరల చట్టం తీసుకురావాలని , రైతులపై పెట్టిన తప్పుడు కేసులను వెంటనే ఎత్తివేయలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు దేశెట్టి సాయిరెడ్డి, సూర్య శివాజీ, ఖాజా మోహినుద్దీన్,శివకుమార్, జన్నారపు రాజేశ్వర్, జె పి గంగాధర్, భారతి,దేవస్వామి, గంగన్న,బన్నీ , ప్రిన్స్, వంశీ,ఎల్లప్ప,శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్, బైక్ ర్యాలీ చేపట్టిన నాయకులు

మన సంస్కృతిని భావితరాలకు అందించాలి

నవతెలంగాణ-దోమకొండ

గ్రామీణ కుల వృత్తులు, మన సాంస్కృతి సంప్రదాయలు కాపాడడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని గడి కోట ట్రస్ట్ సభ్యులు కామినేని అనిల్ శోభన సహకారంతో గణతంత్ర దినోత్సవం సందర్భంగా మన సంస్కృతి మేళా లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల 110 స్టాళ్లను శుక్రవారం సందర్శించారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

రైల్వే బోర్డు మెంబర్‌గా సాయరెడ్డి

నవతెలంగాణ-భీంగల్

మోర్తాడ్ రైల్వే బోర్డు మెంబర్ గా మండలంలోని మెండోరా గ్రామానికి చెందిన తక్కురి సాయ రెడ్డిని నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని రైల్వే అధికారులు శుక్రవారం సాయ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైల్వే రవాణాను నిజామాబాద్ జిల్లా ప్రజలకు అందించడం గర్వించదగ్గ విషయమని అలాగే తనపై నమ్మకం ఉంచి అందజేసిన బాధ్యతను నెరవేరుస్తానని తెలిపారు. రైల్వే రవాణాపై నియోజకవర్గ ప్రజలకు అవగాహన కల్పిస్తానని అన్నారు.


రైల్వే బోర్డు మెంబర్‌గా నియామక పత్రం అందుకుంటున్న సాయరెడ్డి

తారు రోడ్డు పూర్తి చేయడం పట్ల హర్ష

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామ పంచాయతీ నుండి గ్రామ శివారు వరకు మిగిలిన తారు రోడ్డు, కల్వర్టు నిర్మాణం పనులు శుక్రవారం పూర్తయ్యాయి. గత కొన్ని రోజుల నుండి దుమ్ము ధూళి తో ప్రజలు, వాహనా దారులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. రెండు వందల యాభై మీటర్ల మేర పనులు పూర్తి కావడానికి దాదాపు 20లక్షల రూపాయలు మంజూరైందని దానిలో భాగంగానే పనులు పూర్తి చేసినట్లు కాంట్రాక్టర్ మహేందర్ రెడ్డి తెలిపారు


పూర్తయిన తారురోడ్డు

ముస్లిం మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక


ముస్లిం కమిటీ నూతన కార్యవర్గం

నవతెలంగాణ-నందిపేట్

నందిపేట్ మండల ముస్లిం కమిటీ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు కమిటీ ఎన్నికల అధికారి ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాల మస్జిద్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి లు శుక్రవారం ఖుద్వాన్‌పూర్‌లోని షాదిఖాన వద్ద ఏర్పాటు చేసిన సమావేశం లో నూతన కమిటీని ఏకగ్రీవంగ ఎన్నుకొన్నారు. నందిపేట్ మండల ముస్లిం కమిటీ అధ్యక్షునిగా మహమ్మద్ జవీద్ (ఖుదన్పూర్) ఉపాధ్యక్షునిగా షేక్ ఫరీద్ (తొండకూర్) మెయిన్ (మల్లరం) కార్యదర్శిగా మహమ్మద్ అక్బర్ (డొంకేశ్వర్) కోశాధికారి గా మహమ్మద్ మహీముద్ (తల్వేద) సహాయ కార్యదర్శిగా ఆయూబ్ (నందిపేట్) సలహాదారులుగా షేక్‌గౌస్, సాదుల్లాహ్ , ఈసి మెంబెర్ గా డాగుడుసబ్, రసూల్‌ను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా కమిటీ మండల అధ్యక్షుడు జవీద్ మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధి కొరకు కృషి చేయడానికి, రాజకీయ పార్టీలకు, మస్లాకి జమాత్‌లకు సంబంధం లేకుండ స్వంత ఎజెండా తో ముస్లిం మండల కమిటీ పని చేస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ - అభివృద్ధి పథకాలను ముస్లీమ్ ఉమ్మత్ ప్రయోజనం పొందేలా ప్రచారం కల్పించడం, ప్రభుత్వ పథకాల మంజూరు కొరకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ముస్లిం సమాజ సేవలో ఉన్న యువకులను, ముస్లిం మత పెద్దలను ఏకం చేసి మండల కమిటీ ని బలోపేతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. మండల ముస్లింలను ఏకం చేయడానికి కమిటీని ఏర్పాటు చేసినట్లు కమిటీ ఫౌండర్ షేక్ గౌస్ తెలిపారు, మండలంలోని వివిధ గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుండి తెలుగుదేశం పార్టీలో చేరిక

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు జీవన్ రెడ్డి ప్రధాన అనుచరుడు బీఆర్‌ఎస్ యువ నాయకులు పసుల రాజుకు తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ జిల్లా పార్టీ కార్యాలయంలో కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధి, పార్టీ విధివిధానాలు నచ్చి తెలుగుదేశం పార్టీ లోకి వచ్చానని పసుల రాజు అన్నారు. పార్టీ అభివృద్ధి కొరకు ఎల్లవేళలా కృషి చేయాలని అధ్యక్షులు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్, పార్లమెంట్ అనుబంధ సంఘ అధ్యక్షులు దంతాల ఆనంద్, బొబ్బ నరసింహ రావు, మావూరి రాజ శేఖర్, శ్రీనివాస్ బాబు, మాక్లురు మండల అధ్యక్షులు సత్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

1.3 కిలో గ్రాముల ఎండు గంజాయి పట్టివేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ఎక్సైజ్ డిసి, డి పి ఈ ఓ ఆదేశాల మేరకు గురువారం నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్ హెచ్ ఓ దిలీప్ ఆధ్వర్యంలో ఆర్ ఆర్ చౌరస్తా ఫారెస్ట్ ఆఫీస్ పక్క కు గల ఖాళీ ప్రదేశం లో నిజామాబాద్ ఏరియాకి చెందిన షేక్ అజం అనే వక్తి ఎండు గంజాయి అమ్ముతున్నాడని తనిఖీ చేయగా ఎండు గంజాయి పట్టుబడిందని ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ దిలీప్ శుక్రవారం తెలిపారు. షేక్ అజంను అరెస్ట్ చేసి జైలుకు పంపించామని అన్నారు. ఈ దాడులలో ఎస్‌ఐ మల్లేష్ సిబ్బంది , షబ్బీర్ , ప్రభాకర్, సంగయా, రవి, సంజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభల కరపత్రాలు ఆవిష్కరణ

నవతెలంగాణ-ధర్పల్లి

ఈ నెల 28న వనపర్తి లో జరుగుతున్న తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చెయ్యాలని ఇఫ్టూ అనుబంధ టిపిజిపిడబ్ల్యుయూ జిల్లా కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్మికులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు 2021 సంవత్సరం పిఆర్సీ నివేదిక ప్రకారం ముప్పై శాతం పిటిమెంట్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 60 ను విడుదల చేసిందని గుర్తు చేశారు. మున్సిపాలిటీలలో విధులు నిర్వహిస్తున్న నైపుణ్యం కలిగిన వారికి 24,500, సెమి, అన్ స్కిల్డ్ పారిశుధ్య కార్మికులకు 22,100,18వేలు వేత నాలను అమలు చేశారని వెల్లడించారు. గ్రామ పంచాయితీల్లో జీవో 60 అమలు చేయం పోవడంతో నెలకు 9,500 రూపాయల తక్కువ వేతనం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ సమస్యల సాధన కోసం జనవరి 28 న వనపర్తి జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహా సభలను జరుపుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రథమ మహాసభల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని గోపాలరావు పారిశుధ్య కార్మికులను కోరారు. పంచాయతీ కార్మికులు ఆశన్న సాయిలు, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ రిప్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

టీఎమ్ఎస్ఆర్ యూ నిజామాబాద్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు శ్రీనివాస్ రాజు జండా ఎగురవేసి వార్షిక సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజుభట్ ముఖ్య అతిథిగా వచ్చారు. ఆయన ప్రసంగిస్తూ ఫార్మా కంపెనీల వ్యతిరేక విధానాల వల్ల మెడికల్ రిప్స్ ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, కేంద్ర ప్రభుత్వం ఎస్‌పి ఈ యాక్ట్ ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. 2024 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్న ప్రిసైడింగ్ అధికారి అమర్జీత్ రెడ్డి ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు.అధ్యక్షులు గా కె.శ్రీనివాస్ రాజు, సెక్రటరీ లక్ష్మీకాంత్, కోశాధికారి ఆర్ శ్రీనివాస్, కరీముల్లా విపి, సంతోష్ రాథోడ్ సంయుక్త కార్యదర్శి గా ఏకగ్రీవంగా ఎన్నుకోబడినారు. కార్యవర్గ సభ్యులు గా సంపత్ కుమార్, గంగా మోహన్, గిరీష్, మనోహర్, శాస్త్రి శ్రీనివాస్, అనంత్, కృష్ణ, శ్రీకాంత్, జగదీష్, తదితరులు నియమితులయ్యారు. ఈ కార్యక్రమం నామ్‌దేవ్‌వాడలోగల మెడికల్ రెప్స్ ఆఫీస్ లో జరిగింది. కార్యక్రమంలో వంద మంది ఎంఆర్‌లు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

ఉత్తమ ఉద్యోగులకు 'ప్రశంస'

- కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్న పలువురు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల మండలానికి చెందిన వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ ఉత్తమ అధికారి అవార్డును జనవరి 26 సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో, సెక్టార్ ఆఫీసర్‌గా ఉత్తమంగా విధులు నిర్వర్తించడంతో నన్ను గుర్తించి అవార్డు అందించినందుకు సంతోషంగా ఉందని అన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కమ్మర్‌పల్లి : మండలంలోని చౌట్ పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగా జమున ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా అవార్డును అందుకున్నారు.ఈ శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. కార్యదర్శి అవార్డు పొందడం పట్ల ఎంపీడీవో సంతోష్ రెడ్డి, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు.

మాక్లూర్ : మండలంలో ఎంపీడీఓ విధులు నిర్వహిస్తున్న క్రాంతి ప్రశంసాపత్రం అందుకున్నారు. పోలీస్‌పరేష్ గ్రౌండ్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు.

జక్రాన్‌పల్లి : భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న పోలీసులకు సిపి సేవా పథకాలను అందజేశారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ సుశీల్ కుమార్, పోలీస్ కానిస్టేబుల్ రాములు, రాములు హెచ్‌జి సేమలను గుర్తించి సిపి సేవ పథకాన్ని అందజేశారని ఎస్సై తిరుపతి తెలిపారు.

కంఠేశ్వర్ : నిజామాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 75 వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా డాక్టర్ ప్రతిమరాజ్ సూపరింటెండెంట్ అవార్డును అందుకున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిజామాబాద్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ సేవలను అందించినందుకు గాను కలెక్టర్ అవార్డును అందజేశారు.

సిరికొండ : ఉత్తమ సేవకు గాను భీంగల్ మండలంలోని ముచ్కూర్ గ్రామంలో హెల్త్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న సిరికొండ మండల కేంద్రానికి చెందిన కొక్కు రవీందర్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు చేతుల మీదుగా ఉత్తమ హెల్త్ అసిస్టెంట్ ప్రశంస పత్రాన్ని శుక్రవారం అందుకున్నారు. దీనికి సిరికొండ గ్రామస్తులు వర్షం వ్యక్తం చేశారు.


కంఠేశ్వర్ : ప్రశంసాపత్రం అందుకుంటున్న దా. ప్రతిమరాజ్


ఏర్గట్ల: ఏవోకు ప్రశంసాపత్రం


కమ్మర్‌పల్లి :చౌట్‌పల్లి కార్యదర్శికి..


మాక్లూర్: ఎంపీడీవో క్రాంతి..


జక్రాన్‌పల్లి: ప్రశంసాపత్రం అందుకున్న పోలీసులు


సిరికొండ:

క్రీడలు రాజకీయాలకు అతీతం

- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి
- కమ్మర్ పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ కృషి అభినందనీయం
- రాష్ట్ర స్థాయి షటిల్ టోర్నీని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

క్రీడలు రాజకీయాలకు అతీతమైనవని బాల్కొండ ఎమ్మెల్యే మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కమ్మర్ పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్లబ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి షటిల్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. యువత సోషల్ మీడియాలో వీడియో గేమ్స్ మోజులో కొట్టుకుపోతున్న ఈ రోజుల్లో రియల్ గేమ్స్‌లో టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమన్నారు. కమ్మర్ పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్రస్థాయి షటిల్ టోర్నమెంట్ నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. సొంత డబ్బులతో కమ్మర్ పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఇండోర్ స్టేడియం నిర్మించుకోవడం అద్భుత కృషి అని కొనియాడారు. తమది కూడా క్రీడాకారుల కుటుంబం అన్నారు. తన తండ్రి, దివంగత రైతు నేత వేముల సురేందర్ రెడ్డి ఐదు పర్యాయాలు జాతీయ స్థాయి వాలీబాల్ లో ఆడిన క్రీడాకారుడన్నారు. తాను జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారుడినని, తన తమ్ముడు అజయ్ రెడ్డి యూనివర్సిటీ క్రికెట్ క్రీడాకారుడిగా, చెల్లెలు రాధికా రెడ్డి రాష్ట్ర స్థాయి కోకో క్రీడాకారిణిగా రాణించారని గుర్తు చేసుకున్నారు. తన తండ్రి వేముల సురేందర్ రెడ్డి జిల్లా క్రికెట్ జట్టు అధికారిక కెప్టెన్ గా ఆడారని, ఒక మ్యాచ్ లో తాను తన తండ్రితో కలిసి మరో ఎండ్‌లో బ్యాటింగ్ చేసిన సందర్భాన్ని మర్చిపోలేనన్నారు. 80, 90 దశకాల్లో కమ్మర్‌పల్లితో పాటు పలు గ్రామాలు క్రీడల్లో వెలుగుందాయని గుర్తు చేస్తూ కమ్మర్ పల్లి స్పోర్ట్స్ లవింగ్ విలేజ్ అని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ లోలపు గౌతమీ సుమన్, తహసీల్దారు ఆంజనేయులు, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, సర్పంచ్ గడ్డం స్వామి, ఎంపీటీసీ మైలారం సుధాకర్, కమ్మర్ పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎండి. అహ్మద్ హుస్సేన్, సలహాదారు లుక్క గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మైక్రో ఆర్టిస్ట్‌కు అభినందనల వెల్లువ

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని ఆదర్శ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని తన నైపుణ్యంతో అందరినీ అబ్బుర పరుస్తుంది. నల్లూరు గ్రామానికి చెందిన బర్కం అన్సిక ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఈ విద్యార్థిని ఇండియా మ్యాప్, జాతీయ పతాకం, 75వ హ్యాపీ రిపబ్లిక్ డే అని చిన్నపాటి అక్షరాలతో నువ్వులపై లిఖించింది. అక్షరాలను చదవాలన్న, చూడాలన్న మైక్రో లెన్స్ ద్వారా మాత్రమే సాధ్యం. తన తండ్రి బర్కం నరసయ్య కూడా మైక్రో ఆర్టిస్ట్ అని, తండ్రి వద్ద నేర్చుకొని లిఖించానని అన్సిక తెలిపింది. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం ఆదర్శ కళాశాలలో ప్రిన్సిపాల్ శంకర్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అన్సిక ను అభినందించారు.

అక్రమ మొరం తరలింపుపై ఫిర్యాదు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో అక్రమంగా మొరం తరలిస్తున్నారని బాల్కొండకు చెందిన సయ్యద్ రియాజ్ తహసీల్దార్ శ్రీధర్ కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా గ్రామంలోని శివారు ప్రాంతం నుండి రాత్రి మొదలుకొని ఉదయం వరకు అక్రమంగా మొరం తరలిస్తున్నారని అన్నారు. అక్రమ మొరం తరలింపుని అరికట్టాలని, తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

తూంపల్లిలో వాలీబాల్ టోర్నమెంట్

నవతెలంగాణ-సిరికొండ

75వ గణతంత్ర దినోత్సవం పునరించుకొని హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తూంపల్లి గ్రామ యువకులకు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ అయినా శ్రీకాంత్ టోర్నమెంటులో విజేతలుగా నిలిచిన సురేందర్, రాజు, తిరుపతి, యోగేష్, ప్రశాంత్, నరేష్, రవితేజ, మురళి వారికి మెమెంటోస్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలమణి-మల్లేష్ గారు, రాములు నాయక్ విడిసి చైర్మన్ భీమయ్య గంగాధర్, గంగారం గ్రామ ప్రజలు, యువకులు, ఫౌండేషన్ మెంబర్స్ పాల్గొన్నారు.

బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- సింగిల్ విండో చైర్మన్ రేగుంట దేవేందర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పెరియో గడ్డి మందు కొనుగోలు పై స్వాల్ కంపెనీ అందిస్తున్న ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కమ్మర్ పల్లి సింగిల్ విండో చైర్మన్, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద స్వాల్ కంపెనీ వారి పెరియో గడ్డి మందును ఆయన పలువురు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాల్వ్ కంపెనీ పెరియో గడ్డి మందు ఒక లీటర్ బాటిల్ పై రూ. లక్ష ప్రమాద బీమా ఇన్సూరెన్స్ సౌకర్యం రైతులకు కల్పించడం జరుగుతుందన్నారు. రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రిపబ్లిక్ డే సందర్భంగా కేక్ కట్ చేసి, పదిమంది రైతులకు, డైరెక్టర్లకు ఉచిత ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కంపెనీ వారి ఆధ్వర్యంలో పెరియో గడ్డి మందు వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం సింగిల్ విండో డైరెక్టర్లు రేంజర్ల మహేందర్, తీగల హరీష్, కొత్తపల్లి అశోక్, బద్దం రాజశేఖర్, ఎనేడ్ల రవీందర్, రైతులు పాల్గొన్నారు.


గడ్డిమందు బాటిల్ అందజేస్తున్న చైర్మన్, పార్టీ అధ్యక్షులు

చదువుకుంటేనే బంగారు భవిష్యత్తు

- ఏటీఎస్ శ్రీనివాస్

నవతెలంగాణ-నవీపేట్


చదువుకుంటేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని అందుకోసం పదవ తరగతిలో 10/10 గ్రేడ్ సాధించిన విద్యార్థినిలకు 12 వేల బంగారంను బహుమతిగా అందిస్తానని సర్పంచ్ ల ఫోరం జిల్లా అధ్యక్షులు ఏటీఎస్ శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తుందని కాబట్టి సద్వినియోగం చేసుకొని చదువుకుంటే మంచి బంగారు భవిష్యత్తును పొందవచ్చని అన్నారు. అందుకోసమే పదో తరగతిలో ఎంతమంది విద్యార్థులు అయినా 10/10 గ్రేడ్ సాధిస్తే అందరికీ 12 వేల బంగారం బహుమతిని అందిస్తానని, అందరూ కష్టపడి చదివి మంచి ఫలితాలను సాధించాలని కోరారు. విద్యా వ్యవస్థలో మార్పు రావాలని ప్రతి ఒక్కరిలో దేశభక్తి, జాతీయ భావం పెరగాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శ్రీకాంత్ అన్నారు. ఇంతకుముందు విద్యార్థులు చేసిన దేశభక్తి సాంస్కృతిక నృత్యాలతో పాటు ఫ్లాగ్ మార్చ్ ఎంతగానో అలరించాయి. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థినిలకు బహుమ తులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిత,ఎస్ఎంసి చైర్మన్ వీరేందర్, ఆనంద్, పుట్ట శ్రీనివాస్ గౌడ్, రామకృష్ణ, సాయి కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనాథలం అనే భావనను వీడి చక్కగా చదువుకోవాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హితవు

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ లో గల బాలసదన్ లో చిన్నారులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి తదితరులు హాజరై విద్యార్థినులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సదన్ లోని బాలలను సిబ్బంది తమ సొంత బిడ్డలుగా చూసుకుంటూ వారి అభ్యున్నతికి పాటుపడుతుండడం వల్ల పలువురు ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు చదువుతున్నారని అన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ ఎస్.జయరాం, ట్రైనీ ఐపీఎస్ చైతన్య, డీడబ్ల్యూఓ రసూల్ బీ, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, బాలసదన్ పర్యవేక్షకురాలు వినోద, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

పాఠశాలకు విరాళం

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

జాగిర్యాల్ గ్రామంలో పాఠశాల అభివృద్ధి కోసమని పలువురు దాతలు విరాళాలు అందజేశారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దాతలను సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్యార్థులు రానున్న పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు తెచ్చుకుంటారని తెలిపారు.


దాతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మున్సిపల్ చైర్ పర్సన్‌గా పండిత్ వినీత పవన్‌నే కొనసాగించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ చైర్ పర్సన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని కౌన్సిలర్లు పొద్దుటూరి మురళీధర్ రెడ్డి, బదాం రాజ్ కుమార్, డార్లింగ్ రమేష్ తెలిపారు.. పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవనం శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ స్పందించి న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపాలిటిలో మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత్‌పై ఈనెల 4న మున్సిపల్ కార్యాలయం అవిశ్వాస తీర్మాణంపై సమా వేశం రెవెన్యూ డివిజనల్ అధికారి, మున్సిపల్ కమిషనర్ అధ్యరంలో జరిగిందన్నారు. కౌన్సిలర్ల సంఖ్య 36 సభ్యులు, ఎక్స్ అఫిషియ గా ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఉన్నారని తెలిపారు. మొత్తం సభ్యుల సంఖ్య 37కాగా కావున అవిశ్వాసానికి కావలసిన సంఖ్య 2/3 వంతు 25మంది సభ్యులు కావలసి ఉంటుందని అన్నారు.. అవిశ్వాసం నెగ్గడానికి ఆర్‌డిఓ నిర్వహించిన ఓటింగ్ లో 25 సభ్యులు పాల్గొని అందులో 24 మంది సభ్యులు మాత్రమే అవిశ్వాసానికి మద్దతుగా చేతులు ఎత్తి మద్దతు తెలిపిపారని. అన్నారు.. ఎక్స్ అఫిషియ అయిన ఎమ్మెల్యే తటస్థంగా ఉండటం వల్ల అవిశ్వాసానికి కావలసిన సంఖ్య 25 కు సరిపోనందున, మున్సిపల్ చైర్ పర్సన్ పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగి పోయిందన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌ను సైతం ఈనెల 5న కలిసి తిరిగి మున్సిపల్ చైర్పర్సన్‌గా పండిత్ వినీత పవన్ ని కొనసాగించాలని కోరినట్టు తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు పండిత్ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌన్సిలర్లు

విద్యార్థినికి సన్మానం

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని ముచ్కూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కొడిగెల శ్రావన్య రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పరీక్షకు ఎంపికవ్వడంతో గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఎస్ఎంసి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజా ప్రతినిధులు, వీడిసి సభ్యులు సన్మానించారు. ఈనెల 23న జిల్లాస్థాయిలో జరిగిన గణిత ప్రతిభా పరీక్షల్లో (ఇంగ్లీష్ మీడియం) శ్రావన్య రెండో ర్యాంక్ సాధించడంతో రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు .ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయుడు దేవరాజును అభినందించారు

జీపీ పాలకవర్గానికి సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఘనతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందల్ వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యవర్గాన్ని, సిబ్బంది, పాఠశాల అధ్యాపకులు, సర్పంచుల, ఉప సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, రఘునథన్ రామును ఘనంగా సన్మానించారు. వచ్చేనెల 2 న గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగియనుండటంతో సన్మానించినట్లు విడిసి సభ్యులు తెలిపారు.


జీపీ పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

కుర్నాపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు



నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో గల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి సిఐటియు జిల్లా నాయకులు, సిపిఐ(ఎం) ఎడపల్లి మండల కార్యదర్శి జంగం గంగాధర్‌తో పాటు ఎంపీటీసీల ఫోరం ఎడపల్లి మండల అధ్యక్షులు వెంకయ్య గారి రామిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
శనివారం | జనవరి 27, 2024 | www.navatelangana.com

శివాయిపల్లిలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని శివాయిపల్లి మండల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు నాయకుల వేషధారణలో కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు స్వామి, సర్పంచ్ విట్టల్ రెడ్డి, ఉపసర్పంచ్ సంధ్య, ఎస్ఎంసి చైర్మన్ బాలరాజ్, వార్డ్ మెంబర్లు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డి : జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే


కామారెడ్డి : గణతంత్ర వేడుకల్లో జిల్లా ఎస్పీ, పోలీసు అధికారులు


రాజంపేట్ : తహసీల్దార్ కార్యాలయంలో..


జుక్కల్ : క్యాంప్ కార్యాలయంలో జెండావందనం చేస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా గణతంత్రం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేడుకలు
- అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఘనతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ కార్యాలయాల వద్ద.. వివిధ పార్టీల నాయకులు, తమ పార్టీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాణ అంబేద్కర్ చేసిన కృషిని కొనియాడారు.


రామారెడ్డి : పోలీస్‌స్టేషన్ ఎదుట..


సదాశివనగర్‌లో..


బోధన్‌లో..


బిచ్కుంద : జెండా ఎగరవేస్తున్న మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే


దోమకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట జెండావందనం


గాంధారి మండల కేంద్రంలో..


నాగిరెడ్డిపేట్ : తహసీల్దార్ కార్యాలయం వద్ద..




బోధన్ : పోలీసు వేషాధారణలో బాలుడు.. వర్ని మండల కేంద్రంలో..


జుక్కల్ : పోలీస్‌స్టేషన్ ఎదుట జెండావందనం చేస్తున్న పోలీసులు


మాచారెడ్డి : కాంగ్రెస్ ఆధ్వర్యంలో


మద్నూర్ : వ్యవసాయ కార్యాలయం ఎదుట..


నిజామాబాద్‌సిటీ : 'మై చోట' స్కూల్‌లో..


పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని ఓ పాఠశాలలో..


పిట్లం : జెండా ఎగురవేస్తున్న డిప్యూటీ తహసీల్దార్


రెంజల్ : జెండాను ఎగురవేస్తున్న ఎస్ఐ


బిచ్కుంద : భారతమాత వేషధారణలో చిన్నారి



బిచ్కుంద : ర్యాలీలో పాల్గొన్న కవల సోదరులు


రెంజల్ : జెండాను ఎగురవేస్తున్న సర్పంచ్


ఎడపల్లి : ఉత్తమ ప్రశంసపత్రం అందజేత



కామారెడ్డి : ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..



తాడ్వాయి : రవీంద్రభారతి హైస్కూల్‌లో..


ఎడపల్లి : తహసీల్దార్ కార్యాలయంలో..


తాడ్వాయి : తహసీల్దార్ కార్యాలయంలో..


నిజామాబాద్‌సిటీ : 'హోవర్డ్ హైస్కూల్'లో..

మార్క్‌ఫెడ్ కార్యాలయంలో జెండావిష్కరణ

- త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన చైర్మన్ మార గంగారెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్

జిల్లా కేంద్రంలోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి ఎగురవేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ డిఎం రంజిత్ రెడ్డి, నర్సయ్య చారి, భాస్కర్, సరిత అనిల్ తదితరులు పాల్గొన్నారు.


మార్క్‌ఫెడ్ కార్యాలయంవద్ద జెండా ఎగురవేసిన చైర్మన్ మారగంగారెడ్డి

శాంభవి హైస్కూల్లో గణతంత్ర వేడుకలు

నవతెలంగాణ-బాల్కొండ

మండలకేంద్రంలోని శాంభవి హైస్కూల్ విద్యార్థులు గ్రామంలో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఫౌండర్ బొట్ల విజయలక్ష్మి జాతీయ జెండా ఆవిష్కరించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం బహుమతులు ప్రదానం చేశారు . కార్యక్రమంలో కరస్పాండెంట్ బొట్ల రవీణ్ ప్రసాద్ , ప్రిన్సిపాల్ ఇంద్రాణి, వైస్ ప్రిన్సిపాల్ మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గ్రామగ్రామాన త్రివర్ణ పతాకం రెపరెపలు

- అలరించిన విద్యార్థుల నృత్యాలు, విన్యాసాలు
- గ్రామాల్లో విద్యార్థులతో ర్యాలీలు
- గణతంత్ర ప్రాముఖ్యను వివరించిన ఉపాధ్యాయులు

75వ గణతంత్ర వేడుకలు శుక్రవారం గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలను ఎగురవేశారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ, తహసిల్దార్ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్, పోలీస్ స్టేషన్, సహకార సంఘం, ఐకెపి, ఫారెస్ట్ కార్యాలయం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలు, సహకార సంఘాలు, పార్టీ కార్యాలయాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సాంసృతిక కార్యక్రమాలు నిర్వహించి క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

నవతెలంగాణ-విలేకరు బృందం


బాల్కొండ: జెండావందనం చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు


ఆర్మూర్ : ఐఎంఏ ఆధ్వర్యంలో..


డిచ్‌పల్లి : ఇందల్‌వాయిలోని నల్లవెల్లి పీఏసీఎస్‌లో..


నవీపేట్: వేషాధారణలో విద్యార్థినులు


కంఠేశ్వర్ : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..


కంఠేశ్వర్ : పెన్షనర్స్ ఆధ్వర్యంలో..


నిజామాబాద్‌సిటీ : టీడీపీ కార్యాలయంవద్ద..


జక్రాన్‌పల్లి : పడకల్ పాఠశాలలో..


డిచ్‌పల్లి :టీయూలో..


కమ్మర్‌పల్లి : తహసీల్దార్ కార్యాలయం వద్ద..


కమ్మర్‌పల్లి : సీతారాముల వేషాధారణలో విద్యార్థులు


కంఠేశ్వర్ : జీజీహెచ్‌లో..


కంఠేశ్వర్ : మాట్లాడుతున్న సీఐటీయూ కార్యదిర్శ నూర్జహాన్


కంఠేశ్వర్ : ఆఫీసర్స్‌క్లబ్‌లో..


ఆర్మూర్ : నలంద పాఠశాలలో..


డిచ్‌పల్లి : బెటాలియన్‌లో..


నిజామాబాద్‌సిటీ: బ్రిలియంట్ పాఠశాలలో..


కంఠేశ్వర్ :కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో..


డిచ్‌పల్లి : తహసీల్దార్ కార్యాలయంలో..


ధర్పల్లిలో..


మాక్లూర్‌లో..


నిజామాబాద్ సిటీ : శివాజీ వేషధారణలో చిన్నారులు


ధర్పల్లి : ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు


ముప్కాల్ : ఎంపీడీవో కార్యాలయంలో..


మోర్తాడ్ : ఎంపీడీవో కార్యాలయంలో..


సిరికొండ : పీఏసీఎస్‌లో..

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | జనవరి 27, 2024 | www.navatelangana.com

మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండేకు సన్మానం



నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పడంపల్లి గ్రామంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండేను ఆలయకమిటీ సభ్యులు మల్లికార్జున్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామంలో సార్వజనికంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామ దేవత బంగారు లక్ష్మీపూజలు నిర్వహణలో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే షిండే పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు మహా అన్నదానం నిర్వహించారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ విండో చైర్మెన్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రాజుపటేల్, సర్పంచ్, సీనియర్ నాయకులు పావుడే బస్వంత్ పటేల్, లక్షెట్టి బస్వంత్, వీరభద్దర్, వాగ్మారే ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గేదె మృత్యువాత



నవతెలంగాణ-ఎడపల్లి

బోధన్ నిజామాబాద్ ప్రధాన రహదారి పక్కన గల.. ఎడపల్లి శివాలయం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని గేదె అక్కడికక్కడే మృత్యువాతడింది. మండల కేంద్రానికి చెందిన కంజర ఓం ప్రకాష్ అనే రైతు తన గేదెను ఇంటికి తోలుకొస్తుండగా గుర్తుతెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీకొనడంతో గేదె మృత్యువాతపడింది. సుమారు రూ.25 వేల ఆస్తినష్టం వాటిలినట్లు రైతు తెలిపాడు.

పలువురికి ప్రశంసపత్రాలు

- అందజేసిన కలెక్టర్ జితేష్ వి పాటిల్



లింగంపేట్ : ప్రశంసపత్రాన్ని అందుకుంటున్న ఎంపీవో ప్రభాకర్



రామారెడ్డి : ఉత్తమ అవార్డు అందుకుంటున్న అధికారి



బోధన్ : బీపీఎంకు అభినందన

నవతెలంగాణ-విలేకరుల బృందం

లింగంపేట్ : మండలంలోని ఆయా శాఖల్లో పనిచేస్తున్న అధికారులకు వారు చేసిన సేవ కార్యక్రమాలతో పాటు పలు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నందుకు పలువురికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జిల్లా కలెక్టర్ జితిష్ వి పాటిల్ చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందుకున్నారు. లింగంపేట్ మండల పరిషత్ కార్యాలయం ఎంపీఓ ప్రభాకర్‌చారి విధి నిర్వహణలో నైపుణ్యత చాటినందుకు సంక్షేమ పథకాలు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో ఆయనకు ఉత్తమ ప్రశంసపత్రాన్ని అందజేశారు. ఆయన పనితీరును జిల్లా కలెక్టర్ అభినందించారు. అదేవిధంగా రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్ ప్రశంస పత్రాన్ని జిల్లా కలెక్టర్ అందజేశారు. ధరణిలో సమస్యలు తలెత్తకుండా రైతులకు మెరుగైన సేవలు అందించినందుకుగానూ ఆయనకు ప్రశంసపత్రాన్ని అందజేశారు. అలాగే గ్రంథాలయ పాలకులు పెద్దబూరి శ్రీనివాస్‌కు విధి నిర్వహణలో పాఠకులకు అందుబాటులో ఉండి సేవలందించినందుకు గానూ ఆయనకు ప్రశంసపత్రం అందజేశారు. లింగంపేట్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ రాజు రాజేష్‌లు విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేసినందుకు గాను వారికి ప్రశంస పత్రం అందించారు. మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న రేష్మకు ప్రశంస పత్రం అందించారు. మోతే గ్రామ సచివాలయం సచివాలయంలో పనిచేస్తున్న కారోబార్ సాయిలు గ్రామపంచాయతీ పాలనలో ప్రజలకు అధికారులకు పాలకవర్గ సభ్యులకు మెరుగైన సేవలు అందించినందుకు ఆయనకు ప్రశంస పత్రం అందించారు.

బీపీఎం సేవలకు అభినందన..

బోధన్ : బోధన్ పోస్టాఫీసులో బీపీఎంగా విధులు నిర్వహిస్తున్న ప్రసన్న లక్ష్మీ పోస్టల్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రజలను పథకాలలో భాగస్వామ్యం చేసి లక్ష్యం సాధించడంతో శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోస్టల్ శాఖ జిల్లా సీనియర్ సూపరింటెండెంట్ జనార్దన్ ఆమెను అభినందించారు. 373 బీమా పాలసీలు చేయించి రూ.1,70,783 కలెక్షన్ చేశారు. కార్యక్రమంలో అధికారులు ఏఎస్పీ సురేఖ, ఐపీపీబీ మేనేజర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలకు ప్రశంస..

కామారెడ్డి : కామారెడ్డి జిల్లాలోని మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రామ్‌సింగ్ మెడికల్ కళాశాలలో అధికంగా సర్జరీ, లాప్రోస్కోపింగ్ చేసిన మెరుగైన వైద్య చికిత్సలు అందించినందుకు గాను జిల్లా ఉత్తమ డాక్టర్‌గా ప్రశంసపత్రాన్ని కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. రామ్‌సింగ్ వైద్యుడుగానే కాకుండా పేద ప్రజలకు సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నారు.

సామాజిక సేవ ప్రశంసా పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ వేద ప్రకాష్..

కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్, తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపాల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వేదప్రకాష్‌కు 75వ కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన 75 గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా రక్తదానంలో చేస్తున్న కృషి, తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలు నిర్వహించినందుకు గానూ, ఉత్తమ ప్రశంసా పురస్కారాన్ని కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బి.బి.పాటిల్, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిల చేతుల ద్వారా అందుకున్నట్టు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త బాలు తెలియజేశారు.

ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు అందుకున్న చిన్నరెడ్డి

దోమకొండ : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గణతంత్ర వేడుకల సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా ఉత్తమ ఎంపీడీఓ అవార్డు ప్రశంసపత్రాన్ని దోమకొండ ఎంపీడీఓ చిన్నరెడ్డి అందుకున్నారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో గ్రామాలలో చేపడుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసినందుకు ఈ అవార్డు వచ్చిందని ఎంపీడీఓ చిన్న రెడ్డి తెలిపారు.

మండలంలో పలువురికి ఉత్తమ అవార్డులు..

రామారెడ్డి : మండలంలోని పలువురి ఉత్తమ సేవలను గుర్తిస్తూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, స్థానిక ఎమ్మెల్యే రమణారెడ్డి శుక్రవారం ఉత్తమ అవార్డులు అందజేశారు. ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించటంతో రామారెడ్డి పిహెచ్సి వైద్యులు సురేష్‌కు, గ్రామ ప్రజలకు ఉత్తమ సేవలందించిన రామారెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్‌కు, శ్రీ కాలభైరవ స్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రభు రామచంద్రంకు, జూనియర్ అసిస్టెంట్ సురేందర్‌కు ఉత్తమ అవార్డులను అందజేశారు.

నలుగురికి ఉత్తమ సేవ పురస్కారాలు..

సదాశివనగర్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం జరిగిన వేడుకల్లో సదాశివనగర్ మండలానికి చెందిన నలుగురు అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. అవార్డు అందుకున్న వారిలో ఎంపీడీఓ కొండ లక్ష్మీ, సీఐ రామన్, ఎస్సై రాజు, ఎంపీఓ సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

29న జుక్కల్ మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-జుక్కల్

ఈ నెల 29న ఎంపిపి సుర్నార్ యశోదా అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడివో నరేష్ తెలిపారు. వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు తప్పక సమావేశానికి రావాలని, అదేవిధంగా మండల, డివిజన్ స్థాయి, జిల్లా స్థాయిలో ఉన్న వారు తమనివేదికలతో పాటు హజరుకావాలని సూచించారు. ఎమ్మెలే తోట లక్ష్మీకాంతారావ్ ఈ సమావేశానికి రానున్నారని పేర్కొన్నారు.

నీటి శుద్ధీకరణ యంత్రం బహుకరణ



నీటిశుద్ధీకరణ యంత్రం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మాచారెడ్డి

మండలంలోని చుక్కాపూర్ గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల దాహార్తిని తీర్చడానికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం గంటకు 100 లీటర్ల సామర్థ్యం గల నీటి శుద్ధీకరణ యంత్రాన్ని మాచారెడ్డి జెడ్పిటిసి మినుకూరి రాంరెడ్డి పాఠశాలకు అందజేశారు. ఎస్ఎంసి కమిటీ అడిగిన వెంటనే విద్యార్థినీ విద్యార్థుల దాహార్తిని తీర్చడానికి నీటి శుద్ధీకరణ యంత్రాన్ని అందజేసిన మాచారెడ్డి జెడ్పిటిసికి ఎస్ఎంసి కమిటీ, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

యూటర్న్ ఏర్పాటు చేయాలి

- జుక్కల్ ఎమ్మెల్యేకు యూత్ సభ్యులు వినతి

నవతెలంగాణ-జుక్కల్

యూటర్న్ ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని కౌలాస్ గ్రామంలోని జోష్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జోష్ యూత్ గ్రామ అధ్యక్షుడు జి.లింగరామ్, ఉపాధ్యక్షుడు జి.పరమేష్ మాట్లాడుతూ.. జాతీయరహదారి 161 నుంచి కౌలాస్ గ్రామానికి వెళ్లేందుకు హైవేపైన యూటర్న్ లేకపోవడం వలన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జోష్ యూత్ గ్రామ జనరల్ సెక్రటరీ మథిన్, జాయింట్ సెక్రటరీ సిహెచ్ తుకారం, ట్రెజరర్ విశాల్ సింగ్, సలహదారుడు ఆశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు

నవతెలంగాణ-బోధన్

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాకాసిపేట్(జేసీ)లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు దేశభక్తి గీతాలు లయబద్ధం నృత్యాలు చేసి అలరించారు. అనంతరం వివిధ క్రీడాపోటీలలో పాల్గొన్న విద్యార్థులకు హెచ్‌ఎం బాలచంద్రం బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులం ఐక్యంగా మెలుగుదాం

నవతెలంగాణ-మద్నూర్

మున్నూరు కాపులం ఐక్యంగా మెలుగుదామని, అభివృద్ధి పథంలో ముందుకు సాగుదామని మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ విజయ్ తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం భవనం ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు చేరిక



కాంగ్రెస్‌లో చేరిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన కోమట్‌పల్లి రమగౌడ్, వడ్ల సాయిలు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను చూసి అలాగే బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కార్యకర్తల పట్ల చేసిన అన్యాయాన్ని చూసే కార్యకర్తలు అందరూ కూడా కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల యువజన అధ్యక్షులు మల్లయ్య గారి ఆకాష్, రాజారావు, మహమ్మద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు తోటరాజు, వడ్డే శంకర్, ఇప్పుల దుర్గయ్య, మంగా సంగమేశ్వర్, తుకారం తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి 20వేల ఆర్థిక సాయం

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన గొంగళ్ల నర్సింలు గత మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందడంతో మృతుని కుటుంబానికి శుక్రవారం ట్రాన్స్‌కో డిఈ, ఏఈలు సిబ్బంది మృతుని కుటుంబ సభ్యులకు రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డిఈ గణేష్, ఏఈలు సాయినాథ్, తిరుపతిరెడ్డి, జేఎల్ఎం సాయిరాం, మల్లయ్య, లైన్‌మెన్లు ఆదిరెడ్డి, లింగంపేట్ వార్డు సభ్యులు గులాం పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం

నవతెలంగాణ-లింగంపేట్

75వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సామాజిక సేవ తత్పరులు కాముని సుదర్శన్ నేత దంపతులు పాఠశాల చెందిన విద్యార్థి నెలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ నేత మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవ ప్రత్యేకతను పిల్లలకు వివరించారు. దేశ సేవలో ముందుండాలని పిల్లలకు ప్రేరణ కల్పించారు. అనంతరం సుదర్శన్ తల్లిదండ్రులు కీర్తిశేషులు శ్రీ కాముని కాశవ్వ, శ్రీ కాముని రాములు జ్ఞాపకార్థం బాలికలకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసి చైర్మన్ సంతోష్, సిఆర్పి సత్యం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధికారుల సేవలు ప్రశంసనీయం

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడంలో, జిల్లాను వివిధ రంగాల్లో రాష్ట్రంలో మొదటి వరుసలో నిలుపుటలో కృషి చేస్తున్న జిల్లా అధికారుల సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా అధికారుల సంక్షేమ సంఘం ముద్రించిన 2024 నూతన డైరీని అదనపు కలెక్టర్లు మను చౌదరి, చంద్రమోహన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అమలు పరుస్తున్న వివిధ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో జిల్లా అధికారులు స్నేహపూర్వక వాతావరణంలో ఒకరినొకరు సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహిస్తుండడం ఆనందదాయకమని తెలిపారు. గత రెండు సంవత్సరాల క్రితం ఏర్పాటైన జిల్లా అధికారుల సంఘం అనతికాలంలోనే అటు సామాజిక కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు నిర్వహించడం, ఉద్యోగ విరమణ చేసిన, బదిలీ అయిన, నూతనంగా జిల్లాకు వచ్చిన అధికారులను సాదరంగా ఆహ్వానించి కామారెడ్డి ప్రజలంటే మనసున్న సహృదయులని చాటుతున్నారని అన్నారు. విధుల నిర్వహణలో ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారుల సంఘం అధ్యక్షులు రాజారాం, కార్యదర్శి దయానంద్, ట్రెజరర్ సతీష్ యాదవ్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కిసాన్ తండా పాలకవర్గ సభ్యులకు ఘన సన్మానం



పాలకవర్గ సభ్యులకు సన్మానం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కిసాన్ తండా గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ పాలకవర్గ సభ్యులకు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ పదవి ఈనెల 31న ముగుస్తున్న సందర్భంగా వారికి సన్మానం చేసినట్టు కార్యదర్శి సాయిబాబా పేర్కొన్నారు. సర్పంచ్ మలావత్ జమున, ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా కార్యదర్శి రాథోడ్ బీర్‌సింగ్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలోని పాఠశాల ఆవరణలో రిపబ్లిక్ డే సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించినట్లు నిర్వాహకులు మసూద్, రెడ్‌క్రాస్ సొసైటీ బోధన్ డివిజన్ ఉపాధ్యక్షులు అశ్వక్ అహమ్మద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు యువత ముందుకు వచ్చి రక్తదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్థవాని, ఉపసర్పంచ్ ఫెరోజ్ ఉద్దీన్, జెడ్పిటిసి మేక విజయ, ఎంపీటీసీ రుక్మిణి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా నాయకులు కరిపే రవీందర్, వైద్య సిబ్బంది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు



క్యాంపు కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)/నాగిరెడ్డిపేట్

అర్హులైన వారికి సంక్షేమ పథకాలు తప్పకుండా అందుతాయని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన 164 మంది లబ్ధిదారులకు తన క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్.డి.ఓ ప్రభాకర్, లింగంపేట్ జెడ్పిటిసి సభ్యురాలు ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి, నాగిరెడ్డిపేట్ ఎంపీపీ రాజుదాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభం..

నాగిరెడ్డిపేట్ : మండలంలోని గోపాల్‌పేట్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ ప్రారంభించారు. అనంతరం ఎల్లారెడ్డి ఎమ్మెల్యేను సర్పంచ్ వంజరి సునీత శాలువాతో సత్కరించారు. అదేవిధంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ సర్పంచ్ వంచరి సునీతను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.20లక్షలతో నిర్మించిన భవనం చాలా బాగుందని గ్రామపంచాయతీ భవనం లాగే గ్రామం కూడా అభివృద్ధి చేసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బంజారి సునీత, ఉపసర్పంచ్ దుర్గేష్, వార్డు సభ్యులు మంత్రి ఆంజనేయులు, స్వరూప, సహేరా ఫాతిమా, శాంతి కుమార్, ఎల్లారెడ్డి ఆర్‌డిఓ ప్రభాకర్, ఎంపీపీ రాజదాస్, జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రఘు, ఎంపీఓ శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు షాయద్ పాషా, కాంగ్రెస్ నాయకులు రామచంద్రారెడ్డి, విట్టల్‌రెడ్డి, బోయిన విటల్ తదితరులు పాల్గొన్నారు.



నాగిరెడ్డిపేట్ : పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే.

మండలంలోని గోపాల్‌పేట్ గ్రామంలో గల రెండో వార్డులో సిసి రోడ్ల నిర్మాణ పనులను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ ప్రారంభించారు. రూ.2 లక్షల నిధులతో ఈ సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట కోఆప్షన్స్ సభ్యుడు షాహిద్ పా, ఇమామ్, లక్ష్మణ్, గులామ్ హుస్సేన్, మసూద్ ఖలీముద్దీన్, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఎంపీపీ..

మండల పరిషత్ కార్యాలయానికి తొలిసారిగా వచ్చిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌ను ఎంపీపీ రాజుదాస్ శాలువాతో సత్కరించారు. నూతనంగా మండల పరిషత్ కార్యాలయాన్ని మంజూరు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట జడ్పిటిసి మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రామచంద్రారెడ్డి, బోయిని విఠల్, మాజీ సర్పంచ్ విట్టల్ రెడ్డి తదితరులున్నారు.

భూ సమస్య పరిష్కరించండి..

మండలంలోని మాల్‌తుమ్మెద శివారులో గల 834, 835 సర్వే నెంబర్లలో గల భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం నాగిరెడ్డిపేట్ రైతులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌ను కలిశారు. వెంటనే స్పందించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఈ విషయంపై కలెక్టర్‌తో, మంత్రితో మాట్లాడానని, త్వరితగతిన పరిష్కారం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు

నవతెలంగాణ-మద్నూర్/జుక్కల్

జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరికి న్యాయం చేకూరాలని మద్నూర్ మండల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే మద్నూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన గణతంత్ర దినోత్సవం వేడుకల సభలో పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి ప్రత్యేక కృషి..

మద్నూర్ మార్కెట్ కమిటీ అభివృద్ధికి మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రత్యేక కృషి చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్ తెలిపారు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి అలాగే వ్యవసాయదారులకు అన్ని రకాల సహాయ సహకారాలు ప్రత్యేకంగా కృషి చేస్తుందని తెలిపారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో జరిగిన గణతంత్ర వేడుకలకు ప్రత్యేకంగా జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ విట్టల్, సూపర్వైజర్ సత్యం, మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దంపతులకు సన్మానం..

జుక్కల్ : ఎమ్మెల్యే దంపతులను కౌలాస్ రాజ కుటుంబీకులు శుక్రవారం సన్మానించారు. ఎమ్మెల్యే దంపతులు మొదటిసారి గ్రామానికి వచ్చిన సందర్భంగా రాజ కుటుంబీకురాలు అనితాసింగ్ సన్మానించారు. అలాగే జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఎంపీపీఎస్ పాఠశాల హెచ్‌ఎం వినోదా తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్ : జెండావిష్కరణలో ఎమ్మెల్యే

ఎస్టీ హాస్టల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే..

మండలంలోని ఎస్టీ హాస్టల్‌ను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెలేతో హస్టల్ వార్డెన్ దశరథ్ హస్టల్ విద్యార్థుల వివరాలు, వసతి వివరాలు, ఇతర గదులను పరిశీలించి సమస్యలపై వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో విద్యా విషయాలు, భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వాతంత్య దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.